ఘనంగా బతుకమ్మ సంబురాలు

కమాన్‌చౌరస్తా : బతుకమ్మ ఆడుతున్న ఎల్లాపు సంఘం మహిళలు: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఇంపాక్ట్ సభ్యులు

■మూడో రోజు మద్దుపప్పు బతుకమ్మ
■ఆడిపాడిన మహిళలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 16 : జిల్లా కేంద్రంలో మూడో రోజు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా, ముద్దపప్పు బతుకమ్మగా అమ్మవారిని పూజించి, బతుకమ్మ ఆడిపాడారు. జిల్లా ఎల్లాపు సంఘం భవనం చింతకుంటలో బతుకమ్మ వేడుకలు కరీంనగర్ జిల్లా అర్బన్ యూనిట్, రూరల్ యూనిట్ ఆధ్వర్యంలో అట్టహాసంగా సాగాయి. మహిళా కమిటీ సంఘం గౌరవాధ్యక్షురాలు వీర్ల సరోజన, అధ్యక్షురాలు బోనగిరి హరిప్రియ, మాజీ కార్పొరేటర్ తాటి ప్రభావతి, లక్కాకుల ఉమారాణి, పెంచాల సరస్వతి లావణ్య, రమాదేవి, బోనగిరి పద్మలత, ఉషారాణి పాల్గొన్నారు. ట్రినిటీ కళాశాలలో బతుకమ్మ సంబురాలు అట్టహాసంగా సాగాయి. మెయిన్ క్యాంపస్‌లో 1100 మంది విద్యార్థులు హాజరై ఆడిపాడారు. కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి పండుగ విశిష్టతను వివరించారు. కళాశాలల డీన్, ఏవో, వివిధ బ్రాంచ్ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. కరీంనగర్ ఇంపాక్ట్ వారియర్స్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఇంపాక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్రావ్ మాట్లాడుతూ, తెలంగాణ ఆడపడుచులకు ముఖ్య పండుగ బతుకమ్మ అన్నారు. ఇంపాక్ట్ కరీంనగర్ సలహాదారురాలు అనిత, సభ్యులు పిన్నం రవి, లక్ష్మణ్ కుమార్, సయ్యం సాయిబాబు, సుధాకర్, 100 మంది ట్రైనర్స్ పాల్గొన్నారు.

విద్యానగర్: బహుమతులు అందజేస్తున్న మేము సైతం యువసేన ఫౌండేషన్ సభ్యులు

మేము సైతంఆధ్వర్యంలో

విద్యానగర్, అక్టోబర్ 16: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదల వాడల్లో సోమవారం బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. పిల్లలకు బతుకమ్మ పేర్చడం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బతుకమ్మ ప్రసాదం, దాండియా కోలాలు, కొత్త బట్టలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు స్వప్న– శ్రీనివాస్, రూప, విక్రమ్ పాల్గొన్నారు

ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో..

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 16: ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో సోమవారం విద్యార్థులు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు పలువురిని అలరించాయి. కళాశాలల చైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌రెడ్డి ఏవో, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది వేడుకలను తిలకించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

కలెక్టరేట్, అక్టోబర్ 16 : నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కోతిరాంపూర్ సెక్టార్ పరిధిలోని పోచమ్మవాడ, హౌసింగ్‌బోర్డు, లక్ష్మీనగర్, కాపువాడ, కట్టరాంపూర్ సెంటర్లలో బతుకమ్మలు ఆడారు. అంగన్‌వాడీ టీచర్లు స్వరూపారాణి, శ్యామల, పద్మ, హేమలత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్: బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

కరీంనగర్ రూరల్: ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలలో బతుకమ్మ సంబురాలు

'పరిశోధనా పత్రం' అందజేత

ప్రతిపాదన పత్రం అందజేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 16 : రాజస్థాన్ మౌంట్‌అబూలో గల అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ అకాడమిక్ రీసెర్చ్ యోగిక్ సైన్స్, ఎడ్యుకేషన్ వింగ్‌నకు అట్ల శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మహిళా డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా భూపతి రజనీదేవి పర్యవేక్షణలో పరిశోధన ప్రతిపాదన పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రజనీదేవి మాట్లాడుతూ, పరిశోధనలపై యువత ముందుకు రావాలని సూచించారు. డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులలో ధ్యానం ప్రాముఖ్యత, తల్లిదండ్రుల పెంపకం, భావోద్వేగ మేధస్సుపై విశ్లేషణాత్మక అధ్యయనం అనే శీర్షికతో పరిశోధన ప్రతిపాదన పత్రం తయారుచేసినట్లు చెప్పారు. దీనిపై విస్తృత స్థాయిలో సమాచారాన్ని సేకరించి, విశ్లేషణాత్మక పరిశోధన చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఆర్మీ ఉద్యోగాల్లో ఢిల్లీ ఢిఫెన్స్ సత్తా

కొత్తపల్లి, అక్టోబర్ 16 : ఢిల్లీ ఢిఫెన్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు ఇండియన్ ఆర్మీలో ఉద్యోగాలు సాధించినట్లు చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొత్తపల్లి శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ గత నెలలో వెలువడిన ఇండియన్ ఆర్మీ ఫలితాల్లో అకాడమీకి చెందిన 144 మంది విద్యార్థులు ఇండియన్ ఆర్మీలోని పలు విభాగాల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ఎస్ఎస్సీ, జీడీ విభాగంలో 22 మంది, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కానిస్టేబుల్ ఉద్యోగాలకు 187 విద్యార్థులు ఎంపిక యయ్యారని వెల్లడించారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కలెక్టరేట్, అక్టోబర్ 16 : జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి ప్రచార సామగ్రి అయినా జిల్లా ఎన్నికల సంఘం అనుమతి పొందిన అనంతరమే ముద్రణ చేపట్టాల్సి ఉంటుంది. ప్రచురణ కర్తల నుంచి తీసుకునే డిక్లరేషన్, ముద్రించిన సామగ్రి ప్రతిని విధిగా జిల్లా ఎన్నికల అధికారికి అందజేయాలి. ప్రచార సామగ్రి ముద్రణలో ప్రింటింగ్ ప్రెస్, ప్రచురణకర్తల పేరు, సెల్ నంబర్, చిరునామా ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127ఏ ప్రకారం ప్రింట్‌లైన్ చూపాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలపై ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో ఇప్పటికే మొదటి దఫా సమావేశం నిర్వహించారు. తాజాగా సోమవారం కరీంనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి మహేశ్వర్ తన చాంబర్‌లో దిశానిర్దేశం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అడిషనల్ రిటర్నింగ్ ఆఫీసర్లు స్వరూపారాణి, రమేశ్, నవీన్, రాజేశ్, ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు పాల్గొన్నారు.

మంత్రి వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

మంత్రి గంగుల వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

కార్పొరేషన్, అక్టోబర్ 16: కరీంనగర్ నుంచి సిరిసిల్ల వెళ్తున్న మంత్రి గంగుల కమలాకర్ వాహనాన్ని సోమవారం కొదురుపాక సమీపంలో ఎన్నికల అధికారులు, పోలీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలకు మంత్రి పూర్తిస్థాయిలో సహకరించారు.

అల్ఫోర్స్ హైస్కూల్లో కెడెట్ల ముఖాముఖి

మాట్లాడుతున్న అధికారులు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 16 : కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా కెడెట్లతో సోమవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి, కల్నల్ డానియల్ లాటెమ్, సాగర్ సింగ్, ఆర్ సంజీవ్, అధికారులు హాజరై మాట్లాడారు. ప్రాథమిక దశ నుంచే దేశభక్తి పెంపొందించి సంబంధిత కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందించి విద్యార్థుల్లో దేశభక్తిని పెంచాలన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన కెడెట్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ కే త్రివేణి, ఎం పురుషోత్తం, ధృవకుమార్, సీహెచ్ ఉదయిశ్రీ, జీ సత్యప్రకాశ్, పాదం సింగ్, వికాస్ కుమార్, పుసూరి మల్లప్ప, రఫీక్ ముల్లా, హకీంసింగ్, ప్రిన్సిపాల్, కెడెట్లు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సెంటర్లు పరిశీలించిన రాష్ట్ర వైద్య బృందం

విద్యానగర్, అక్టోబర్ 16 : నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న అసంక్రమిత వ్యాధుల నిర్మూలన కేంద్రాలను రాష్ట్ర వైద్య బృందం సోమవారం పరిశీలించింది. ప్రధానాస్పత్రిలోని జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్, పల్లెటివ్ కేర్ సెంటర్, మానసిక వ్యాధుల చికిత్స కేంద్రం, జడ్పీ క్వార్టర్స్‌లో గల వృద్ధుల ఉపశమన ఫిజియోథెరపీ కేంద్రాన్ని రాష్ట్ర ఎన్‌సీడీ పరిశీలకురాలు డాక్టర్ అనూషాదేవి సందర్శించారు. జడ్పీ క్వార్టర్స్‌లోని వృద్ధుల ఉపశమన కేంద్రంలో అందుతున్న సేవలను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నవంబర్ ఒకటి నుంచి జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో ఎన్సీడీ స్క్రీనింగ్ జరుగనున్న నేపథ్యంలో రూరల్ ప్రాంతాల్లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ర్యాండంగా పరిశీలించామన్నారు. ఎన్‌సీడీ బృందం పరిశీలించిన సెంటర్లలో చామనపల్లి పీహెచ్‌సీ, దుర్శేడ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను రాండమ్‌గా ఎంచుకుని తనిఖీ చేశారు. ఆయాచోట్ల చేపట్టిన ఏర్పాట్లు క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి, జిల్లా ప్రధానాస్పత్రి సూపరింటెంటెండ్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ సుజాత, పల్లెటివ్ కేర్ వైద్యులు చిన్నికృష్ణ, పృథ్వీ, రాష్ట్ర ఐటీ కన్సల్టెంట్ రాజశేఖర్, జిల్లా ప్రోగ్రాం అధికారి తులసీరవీందర్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

మానేరు వాకర్స్ ప్రతినిధులకు సన్మానం

కొత్తపల్లి, అక్టోబర్ 16 : నగరంలోని మానేరు వాకర్స్ క్లబ్ ప్రతినిధులను ఇంటర్నేషనల్ వాకర్స్ నాయకులు సోమవారం సన్మానించారు. వాకర్స్ క్లబ్‌లోని పలువురు సభ్యులను ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా చేరేందుకు ప్రోత్సహించిన నేపథ్యంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు ఆనందం, అధ్యక్షుడు కనకాచారి, ప్రధాన కార్యదర్శి ముసుకుల విద్యాసాగర్‌రెడ్డికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ సభ్యులను మానేరు వాకర్స్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.